
# చిత్ర(వి)చిత్రాలు



స్వామి చిత్రానంద

"ఎక్కడయ్యా! ఇద్దరు ప్రొడక్షన్ మేనేజర్లూ?" అంటూ సెట్‌లోకి అడుగు పెడుతూనే నిర్మాత అడిగాడు.

"పెద్దాయన్ని సముద్ర జలానికి పంపానండి" అన్నాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"చిన్నాయన?" అని రెట్టించాడు.

"నాకు తెలీదండి."

నిర్మాత సెట్ లోపల కంటా వెళ్ళి రెండో అసిస్టెంట్ డైరెక్టర్ని అడిగాడు చిన్న మేనేజర్ కోసం—



"సముద్రోదకానికి పంపానండి" అన్నాడు.

"ఏమిటయ్యా! మీ యిష్టమొచ్చినట్టు - సముద్ర జలానికి ఆయనా, సముద్రోదకానికి నువ్వాను—"

"కవిగారు అలా రాశారండి. 'లక్ష్మణుడు సముద్రోదకం తెచ్చి రామునకు యిచ్చును. విభీషణుడి శిరస్సుపై రాముడు సముద్ర జలం చల్లును' అని. మనమేం చేస్తామండి. ఆఫ్టరాల్ అసిస్టెంట్స్‌మి!"

"కవిగారు రాశారా?— అలాగైతే సరేలే."

* * *

నిర్మాణంలోనే అయిదారేళ్ళు పట్టిన ఒక మహత్తర పౌరాణిక, జానపద, సాంఘిక, రాజకీయ చిత్రం ఈ ఏటికి విడుదలకు సిద్ధ



మైంది. ఈనాడు పాత్రికేయులకందరికీ ప్రత్యేకంగా చూపిస్తున్నారు.

ఊరికి నాల్గు మైళ్ళ అవతలవున్న స్టుడియోలో చూపించటంచేతా, ప్రదర్శనానంతరం విందు భోజనం వుండటంచేతా నాల్గు గంటలసేపూ అంతా హాల్లో వుండక తప్పలేదు. ఒకరిద్దరు మధ్యలో లేచిపోదామని బయటకు వచ్చినా, వాహన సదుపాయంలేక మళ్ళీ లోపలకు వెళ్ళి కళ్ళు మూసుక్కూచున్నారు.

ప్రదర్శన పూర్తయేసరికి దర్శక నిర్మాతవచ్చి గుమ్మానికి అడ్డంగా నిలబడి 'చిత్రం బాగుందని పొగడరేం?' అన్నట్టు వస్తున్న వాళ్ళకేసి చూస్తున్నాడు. ఇది గమనించిన కొందరు గడుసువాళ్ళు అవతల గుమ్మంనించి తప్పించుకుని గండంనించి బయటపడ్డారు.

నిర్మాత కంటపడిన ఒక పాత్రికేయుడు కడుపుమంటతో—

"మీరీ చిత్రాన్ని పాతికేళ్ళ క్రితం తీయాల్సింది" అన్నాడు.

"ఏవునండి నేను దీన్ని లండన్‌లో చదువు మానేసిన తర్వాత రాశాను. ఇండియా రాగానే కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్సు, సాంగ్సూ, డ్యాన్సులూ రాశాను. సినిమా తీస్తానంటే మా నాన్నగారు వద్దన్నారు. తీస్తే వురిపోసుకు చచ్చిపోతానని బెదిరించారుకూడా— అంచేత ఆయన బతికుండగా వూరుకుని, చావగానే మొదలెట్టి తీశాను – మా బ్రదర్స్ ఒద్దంటున్నా—"

"మీ నాన్నగారు ధన్యులు! ఆయన ప్రాణాన్ని అడ్డుగా పెట్టిఎన్ని ప్రాణాలు రక్షించారు!" అన్నాడు మరో రచయిత

"అయితే మా నాన్నకి దీన్ని అంకితం యివ్వనా?" అన్నాడు నిర్మాత.

"ఇచ్చినా పర్వాలేదు—"

"చచ్చిన వాళ్ళకిస్తేనే మంచిది" అన్నాడు మరో రచయిత.

* * *

ఒక తార నూతన గృహప్రవేశానికి వచ్చిన కొందరి స్వాగతాలు –

సహనటి:– "మేవిద్దరం గ్రూపు డ్యాన్సు చేసినప్పుడు ఈస్థలం కొంది."

నూతన నటుడు: "అదృష్టం కల్సిరావాలే గాని – ఎంత సేపు కట్టాలి?"



నిర్మాత: "మన హీరో యిల్లు కింద షూట్ చేద్దామా?"

దర్శకుడు: "కాని ఇది మరీ "రిచ్" అయిపోతుంది."

కెమెరామన్ : "కలర్ మరీ లైటయిపోతుంది."

ఆర్టు డైరెక్టర్: "గుమ్మాలు మరీ వెడల్పు పెట్టింది—"

రచయిత: "హీరోయిన్ ముందాలోచనతోనే పెట్టించింది లెండి."

* * *

సైడ్ హీరోయిన్ సెట్లోకి రాగానే ఎదురుగా ఓ కుర్చీలో కూచున్న నిర్మాతగారి వేలు విడిచిన మేనల్లుడి కొడుకుతో —

"నువ్వు లెగయ్యా" అంది.

అది విన్న సెట్లో జనం అంతా గొల్లుమని నవ్వారు.



ఈ నవ్వుకి కారణం అర్థంకాలేదు ఆమెకు. ఎవర్నడిగినా చెప్పలేదు.

ఇంతలో సెట్లోకి వచ్చిన మరో సైడ్ హీరోయిన్ తో కథంతా చెప్పింది. ఆమె తనలో తాను గర్వంగా నవ్వుకుని —

"లెగు ఏంటి — లెయ్యి అనాలి గాని—" అంది.

ఇది విన్న జనం - సెట్ లో వున్న తిరపతి యాత్రికులతో సహా- అంతా విరగబడి నవ్వారు.

* * *

ఒక హాలీవుడ్ తారకి తన ప్రియుడి మీద మోజు తగ్గిపోయింది లాభదాయకమైన మరొకడు దొరగ్గానే



యితన్ని విడుదలచేసి పంపేసింది. ఆ ప్రియుడు చేసేది లేక బయటకు వస్తూ వస్తూ గేటుకువున్న "బివేర్ ఆఫ్ డాగ్స్" అన్న బోర్డులో "డాగ్స్" అనే మాట కొట్టేసి "బిచెస్" అని రాసి కారెక్కి కూచుంటూ వుండగా తార తాలూకు ఒక కుక్కపిల్ల కనిపించగా "ఛీ! ఛీ" అని అసహ్యించుకుని తరిమెయ్య బోయాడు.

"ఎందుకు బాబూ! దీన్ని ఛీ

అంటారు ? మీ బిస్కట్లు తిన్న దీని కున్నపాటి విశ్వాసం, మీ బిస్కటు ఫ్యాక్టరీ రాయించుకున్న దానికి లేక పోయింది. రానీండి. కుక్క పిల్లని మనింటికే తీసుకెళ్దాం" అన్నాడు డ్రయివర్.

* * *

ఆమధ్య భారత గాధలతోవచ్చిన కొన్ని తెలుగు సినిమాల్ని చూసిన వ్యాస మహర్షికి భారతం తాను వ్రాసినదేనా అని సందేహం కలిగి, వినాయకుణ్ణి పిలిచి —

"నాయనా ! ఏమిటీ భారత కథలు? నేను చెప్పడం లోపమా ? నీవు ఉల్లేఖించడం లోపమా ?" అని అడిగాడు.

వినాయకుడు ఈ అనుమానానికీ అవమానానికీ లోపల కొంచెం కించ పడినా, తేరుకుని —

"మహర్షీ ! ఈ ప్రశ్న తమరు నన్న డుగుతారని నాకు తెల్సు. అందుకే, ఇంతకుముందు నేను ఒకరిద్దరు నిర్మాతల్ని అడిగాను, మహాభార



తాన్ని వ్యాసమహర్షి చెప్పగా నేను రాశాను. మీ సినిమాల సంగతి ఆయనకి తెలిస్తే ఏమిటిలా రాశా వని నన్ను దండిస్తారు, ఏమిటీ ఈ మహాభారత కథలు ?" అని అడిగాను — వారు నాకిచ్చిన సమాధానం —

"ఇవి మహాభారత కథలు కావు— మా భ్రాంత కథలు అని."

♦ ♦ ♦

ఆ మధ్య ఘనంగా జరిగిన ఒక చిత్రం తాలూకు శతదినోత్సవం గురించే వూరంతా గొప్పగా చెప్పు కుంటున్నారు, ఆ చిత్రానికి పనిచేసిన




సహాయ దర్శకుడికి తారసిల్లిన మరో సహాయ దర్శకుడు —

"ఏమిటి మీ చిత్రానికి శతదినోత్సవంచేశార్టగా — మీ కేమిచ్చారు ?"

"ఇవ్వకేం ? — చాలా యిచ్చారు. నన్ను విజయవాడ రానిచ్చారు, సభలో కూచోనిచ్చారు, నిర్మాతకు బహుమతులు అందివ్వనిచ్చారు" అని గర్వంగా చెప్పుకున్నాడు.

□□□

# చిత్ర(వి)చిత్రాలు




స్వామి చిత్రానంద

చాలా సంవత్సరాలు అసిస్టెంటు డైరెక్టరుగాపనిచేసి, దర్శకుడికి కుడి భుజం అని పేరు పొందిన ఒకతను ఈనాటికి డైరెక్టరయ్యాడు. ఆరోజే షూటింగు మొదలు —

షాట్ అరేంజిచేశాడు, నాయికా నాయకులచేత సంభాషణలు చెప్పించాడు. కెమెరామన్, రికార్డిస్టు అంతా "ఓ కే రెడీ ఫర్ టేక్" అన్నారు.


'ఉండండి - డైరెక్టర్ గార్ని పిల్చుకు వస్తాను' అని సెట్ బయటకు వెళ్ళిపోయాడు దర్శకుడు.



"20 ఏళ్ళ అలవాటు ఒక్క రోజులో ఎలా పోతుంది?" అన్నాడు హీరో.

* * *

"మా పిక్చర్ తప్పకుండా ఏడు వారాలు ఆడితీర్తుంది" అని ఢంకా పథంగా, ఛాతీ విరుచుకుని చెబుతున్నాడు రచయిత.



"అలాగా ? అంతకన్నా కావల్సిందేవిటీ ?" అన్నాడు కొత్త హీరో.

చిత్రం విడుదల అయింది. కొన్ని చోట్ల మొదటి వారంలోనే చిత్రాన్ని తీసేశారు. హీరో రచయితను నిల దీసి అడిగాడు —

'ఏవండీ ! ఏడువారాలు పోతుం దన్నారే ?' అని.

'అవునయ్యా, శుక్రవారం, శని వారం, ఆది వారం, సోమవారం, మంగళవారం, బుధవారం, గురు వారం. ఎన్నయ్యాయి ? ఏడు వారా లవలేదూ ?'

* * *

'నవ రసాలు నాకు తెలియదా ? ... మిరియాల రసం,



టొమాటో రసం, నిమ్మకాయ రసం... మరొచ్చి...' అని కాస్సేపు ఆలోచించి తలగోక్కున్నా జ్ఞాపకం రాకపోయేసరికి ... 'ఇంకా రెండో మూడో వుంటాయ్' అని చెప్పేసింది నర్తకి.

'ఇన్నేళ్ళుగా నాట్యం చేస్తున్నావ్. 'నాట్యమయూరి' అని బిరుదు పుచ్చుకున్నావ్. నవరసాల పేర్లు తెలీవూ?' అని కసురుతున్నాడు నాట్యాచార్యుడు.

'మా బేబీ కాన్వెంటులో గదా సదివింది. మీరు సెప్పండి-' అని బతిమాలింది నర్తకి తల్లి.

'చెప్పుతాను. చెప్పక చస్తానా? 1) శృంగారం 2) హాస్యం 3) కరుణ 4) భయం 5) శోకం 6) బీభత్సం 7) రౌద్రం. ఈ ఏడున్నూ నవరసములు' అన్నాడు నాట్యాచార్య భరత్‌కుమార్.

* * *

విశాలాంధ్రలో విజయ ఢంకా మ్రోగిస్తున్న "హిట్ ప్రొడక్షన్స్" వారి తొలి కానుక 'బ్రహ్మాండ భాండం' కథ నాదంటే, నాదంటూ ముగ్గురు ఆ చిత్ర నిర్మాతమీద రచయితమీదా దావా వేశారు.

'ఈ కథ, క్లయిమాక్సూ నా "సువర్ణభాండం" అనే కథానిక లోనిది. 'నా కథ, నా టైటిల్‌లో సగమూ కొట్టేశారు' అన్నాడు ఒక వర్ధమాన రచయిత.

'అదేమీ కాదు. ఇది నా తమిళ కథకి మక్కికి మక్కీ కాపీ. కావాలంటే ఆ చిత్రాన్ని చూపిస్తాను' అన్నాడు ఒక తమిళ రచయిత.

'ఇది నా తొలి తెలుగు నవల. 'కుంభవృష్టి'లో పదునాల్గవ ఆశ్వాసమున్నూ, పదునారవ ఆశ్వాసంలో సగమున్నూ కలిపి ఈ సినిమా కథ చేశారు' అన్నాడు ఒక తెలుగు పండితుడు.

ఈ అభియోగాలన్నీ విన్న జడ్జి



అసలు చిత్ర రచయితను సంజాయిషీ అడిగారు.

'ఈ కథ నా స్వంతం. దీన్ని 1937 లో రాశాను. దాన్ని వార పత్రిక నిరాకరించింది. వారు తిప్పి పంపుతూ రాసిన వుత్తరం, ఆ నాటి నా తొలి ప్రతి' అని పాత కాగితాలు చూపించాడు అసలు రచయిత.

ఇదంతా విన్న జడ్జి—

'గొప్పవాళ్ళంతా ఒకలాగే ఆలోచిస్తారని ఆంగ్లంలో సామెత వుంది. మీ రచయితలంతా గొప్ప వాళ్ళే. మీరు ఒకర్ని ఒకరు కాపీ చేసుకోడం జరగదు. ఒక రచయిత గొప్పతనాన్ని ఓర్వలేని మీ ముగ్గురికీ తలా పది రూపాయల జరిమానా విధిస్తున్నాను. ముగ్గురు రచయితలు ఊహించగల కథనే రచించిన రచయితకూ, 30 ఏళ్ళ పాత కథను చిత్రంగా తీసిన నిర్మాతకూ తలా అయిదు రూపాయలూ శిక్ష విధించాలి. కాని—ఈ నాటికి పనికివచ్చే కథను 30 ఏళ్ళ క్రితమే రచించిన రచయితనూ, తెలుగు కథను తెలుగు సినిమాగా తీసిన తెలుగు నిర్మాతనూ అభినందిస్తూ, వీరి జరిమానాను మాత్రం రద్దు చేస్తున్నాను' అన్నారు.


* * *

'ఎవడు ఈ సబ్బు తెచ్చింది?' అని హీరోయిన్ కనబడ్డ వాళ్ళందరి మీదా కారాలూ మిరియాలూ నూరేస్తోంది. ఆమె ఎదటికి వెళ్ళాలంటేనే అంతా హడలి పోతున్నారు. అసలు ఆ సబ్బు పట్టుకొచ్చిన మేనేజర్ స్టుడియోలో లేడు. అంటే ఏమయ్యేదో! అతను వచ్చిం తర్వాత ఆమెకు క్షమాపణ చెప్పిస్తానని నిర్మాత ఆమెకు హామీ యివ్వడంతో ఆమె కాస్త చల్లబడింది.

ఇంతలో మేనేజర్ ఓ కార్లోంచి వూడిపడ్డాడు.

'ఏమయ్యా! ఆ సబ్బు ఎందుకు తెచ్చావు?' అని గర్జించాడు నిర్మాత,

మేనేజర్ ఏదో చెప్పబోతూంటే వినిపించుకోకుండా-



'నేరుగా వెళ్ళి, ఆమెతో చెప్పుకో' అన్నాడు నిర్మాత.

మేనేజర్ ఆమె దగ్గరకు వెళ్ళి,

దూరంగా నిలబడి 'అమ్మా! నా సౌందర్య పోషణకు నిత్యమూ వాడుదును' అని మీరు అన్నారని ఆ సబ్బు తెచ్చాను, క్షమించండి' అన్నాడు.

'అది సబ్బా అది? దాన్నెప్పుడేనా నేను చూసెరుగుదునా? నా ఫొటోలు పేపర్లో పడతాయంటే సరే అన్నాను. ఆ ఫొటోతోపాటు ఏం రాశారో నాకేం తెల్సు?'

'అలాగేనండి. మరి ఏ సబ్బు తెమ్మంటారు?'

'రేపు పొద్దున ఫోన్ చెయ్ - నే వచ్చేటప్పుడు ఆ ఖాళీ అట్టపెట్టె పట్టుకొస్తాను.'

'అలాగేనండి.'

* * *

ఒక చెవిటి నిర్మాత దగ్గరకు వేషంకోసం నత్తినటుడు వచ్చాడు. తన ఫొటో ఆల్బమ్‌ను నిర్మాతకు యిచ్చాడు నటుడు. అందులోవున్న వివిధ రసాల్తో, వివిధ భంగిమల్లో వున్న ఫొటోలు చూసి మురిసిపోయిన ఆ నిర్మాత,

'మీకు వేషం ఖాయం —' అన్నాడు.

'చా... చా...' అని ఏదో చెప్పడానికి ప్రయత్నం మొదలెట్టాడు-

'మీరేం యిదవకండి - వేషం చాలా మంచిది.'

'చా... చా...'

'డబ్బుకేం ... నూట పదహార్లు. ఒకరోజు వర్క్ అంతే.'

'చా... చా...'

'పోనీ, నూట ఏభై'

'చా... చా...'

'రెండొందలు.'


'చా... చా...'

'పోనీ, మూడొందలు-ఇక అడ్డు చెప్పకు.'

'చా... చా... లా ... థాంక్సు సార్' అని నిర్మాతకు చెప్పి బయటకు వస్తూ, 'నత్తి కూడా మంచిదే- అది లేకపోతే నాకు రు 184/-నష్టం కదూ' అనుకున్నాడు నటుడు.

□□□

ఒక దున్నపోతు ఇంకో దున్నపోతుతో : నువ్వు కూడా సిగరెట్లు కాల్చలేదా, పూర్వజన్మలో?



రెండో దున్నపోతు : అవును; అదే పొరపాటైంది. నాకు గిరీశంగారు రోజూ చెబుతూ వుండేవారు కూడాను.


# చిత్ర విచిత్రాలు

స్వామి చిత్రానంద

ఈ మధ్య మరీ అర్ధనగ్నంగా తయారవుతూన్న ఒక చిత్రం నిర్మాణంలో వుండగానే, ఆ చిత్రం సెన్సార్ అవదనీ-అయినా, చాలా దృశ్యాలు పోతాయనీ, దానికి 'ఎ' సర్టిఫికెట్ తప్పదనీ, చాలామంది సహ నిర్మాతలు సంతోషిస్తున్నారు.

అంతా యిలా అనుకుంటున్నారని తెలిసి, ఆ నిర్మాత మిగతా సగం చిత్రాన్ని సర్వనగ్నంగా తీశాడు. సెన్సార్ అవుతోంది. దాని ఫలితం కోసం ఎందరో నిర్మాతలు ఆత్రుతగా చూస్తున్నారు. ఆ చిత్రాన్ని నిషేధించినా ఆశ్చర్య పడక్కర్లేదనుకుంటున్నారు.

ఇంతలో ఆ నిర్మాత స్టుడియోకి వచ్చాడు. అంతదూరంలో అతన్ని చూసి, గబగబా దగ్గరకు వెళ్ళారు.




'ఏమైంది ?'

'ఎన్ని వేలు కట్ చేశారు ?'

'కాంతి శ్రీ డ్యాన్సులన్నీ పోయినట్టేనా?'

అంటూ రకరకాలుగా ప్రశ్నించారు.

'అటిమీద అసలు చెయ్యే ఎయ్యలేదు. టైటిల్స్‌లో డ్రెస్ — మేన్ కార్డుమాత్రం తీసెయ్యమన్నారు.'

'అదేంటి?'

'మీ సినీమాలో అసలు డ్రెస్సులే లేవుగదా. డ్రెస్సుల్లేనపుడు డ్రెస్సుమెన్ కార్డు వుండరాదు' అన్నాడు ఆఫీసరు అని చెప్పాడు.

'ఆహా ! ఆ ఆఫీసరెంత మంచోడండి' అని అంతా అతన్ని ఏక కంఠంతో అభినందించారు.

* * *

ఒక తెలుగు చిత్ర నిర్మాత, అతి క్లుప్తంగా అతి చవకలో ఒక తెలుగు చిత్రం తీయాలని ఒక తెలుగుకథను, తెలుగు భాషలో మాత్రమే నిర్మించే హక్కును తెలుగు రచయిత వద్ద కొని, నిర్మాణం ప్రారంభించాడు.


తెలుగు కథని ఇతర భాషలవాళ్ళు ఎవరు కొంటార్లే అని, ఆ సర్వ హక్కులూ రచయితకే వదిలేశాడు.

ఆ రచయిత అదృష్టం బాగుంది. ఆకథను ఒక తమిళనిర్మాత కొని, తెలుగులో నటిస్తున్న నాయికతోనే నిర్మాణం ప్రారంభించాడు. తెలుగు చిత్రం కన్న ముందుగానే తాను పూర్తిచేయదల్చుకున్నాననీ, ఆమె తనతో సహకరించాలనీ ఆమెకు మరికొంత మొత్తం ఎక్కువగా ఇచ్చి, చకచకా చిత్రం షూట్ చేస్తున్నాడు. విడుదలకు కూడా సిద్ధమయింది.

ఈ సంగతి తెలుగు నిర్మాతకు తెల్సింది. కాని ఏంచేస్తాడు! తన దురదృష్టం అనుకున్నాడు. తెలుగు కథని తెలుగు సినీమా తీయాలని నిర్ణయించుకున్న తన తెలివితక్కువ తనాన్ని నిందించుకున్నాడు.

తమిళచిత్రం విడుదలైంది; ఆ నాయిక చిత్రం అంటే చెవికోసుకునే తెలుగు ప్రేక్షకులకోసం దాన్ని "డబ్" చేయాలని తెలుగుదేశంనించి హుటాహుటి ఒక యువ నిర్మాత వచ్చి తమిళ చిత్రం బేరమాడుతున్నాడు.

తన చిత్రం పూర్తికావడంలేదని






జో

బాధపడుతున్న తెలుగు నిర్మాతకి ఈ వార్త తెల్సింది. మూలిగే నక్క మీద తాటికాయ పడినట్టయింది, ఆయన శ్రేయోభిలాషి, అంతరంగిక కార్యదర్శి అసలీ కథని కొనమని ప్రోత్సహించిన 'చలనచిత్ర సర్వజ్ఞుడూ' ఆ తమిళచిత్రం డబ్బింగు హక్కులుకూడా కొనమని సలహా ఇచ్చాడు నిర్మాతకు.

'కొంటాను. ఎంత ఖరీదైనా కొంటాను. తెలుగుకథని, తెలుగు వాళ్ళకోసం తెలుగు సినీమాగా తీయాలనుకోవడం తెలుగువాడి బుద్ధితక్కువ అనుకుంటాను. ఆ తమిళచిత్రం డబ్బింగు హక్కులు కొంటాను. కాని దాన్నిమాత్రం డబ్బింగు చెయ్యను. అసలీచిత్రాన్ని పూర్తిచెయ్యను. అప్పుడు ని ఈ తెలుగువాళ్ళ తెగులు కుదరదు' అని భీష్మించుకున్నాడు.

● ● ●

మద్రాసులో తెలుగుతారల్ని చూసి, వారి ఆటోగ్రాఫుల్ని సేకరించి, పుస్తకరూపంలో ప్రచురించి తన వేసవిసెలవుల్ని ఈ విధంగా సద్వినియోగం చేసుకోవాలనుకున్న ఓ విద్యార్థి మదరాసు వచ్చి, తారల చిరునామాల్ని సులువుగా తెలుసుకుందుకు వీలుగా వుంటుందని, మూడు రూపాయలిచ్చి, ఒక ఫిలిం డైరెక్టరీ కొనుక్కున్నాడు. అందులో వున్న చిరునామాల ప్రకారం ఎంత తిరిగినా, ఒక్కరినీ కలుసుకోవడం పడలేదు— అన్నీ తప్పుచిరునామాలే! అతనికి విసుగెత్తి, ఆ డైరెక్టరీ



సంపాదకుడిని కలిసి, ఛెడామడా తిట్టాలనుకున్నాడు. నేరుగా అతని అడ్రసుకు వెళ్ళాడు. ఆ అడ్రసులో అతనూ లేడు. అతనికి ఒళ్ళుమండింది. ఆ మంటల్ని ఆర్పుకుందుకు పాండీబజార్ వచ్చి, ఓ చల్లని పానీయం తాగి, వెచ్చగా ఓ సిగరెట్ కాలుస్తూవుండగా, ఎదురుగా ఓ చెట్టుకింద నిలబడి సిగరెట్ కాల్చుకుంటున్న ఆసామీయే ఆ సంపాదకుడని తెల్సింది. నేరుగా అవతల పక్కకు వెళ్ళి ఆయన్ని నిలబెట్టి అడుగుతున్నాడు—

'ఇదేం డైరెక్టరీ అయ్యా! దీన్నిండా అన్నీ తప్పులే—!'

'నన్నేం చెయ్యమంటారు! అవన్నీ అచ్చుతప్పులు! తప్పొప్పుల పట్టిక వేస్తున్నాం— ఓటి కొనుక్కోండి. ఎంతో వుండదు— రూపాయిన్నర!'

'అదీ కొంటాననుకోండి గానికి మళ్ళీ మరో తప్పొప్పుల పట్టిక వుండదుగదా!' అన్నాడు విద్యార్థి.

'ఏం చెప్పగలమండీ!' అని వెళ్ళిపోయాడు డైరెక్టరీ సంపాదకుడు.

□□□